క్లుప్తంగా

సామూహిక మాలధారణ



భవానీ దీక్షకు ఉపక్రమిస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల కొంగు బంగారం పాలకొండ శ్రీ కోటదుర్గమ్మ దేవస్థానంలో భక్తులు సామూహిక మాలధారణ కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. మరో రెండు రోజుల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న క్రమంలో భక్తులు అమ్మవారి ఉపాసనకు సిద్ధమయ్యారు. సాంప్రదాయ బద్ధంగా భవాని దీక్షలకు ఉపక్రమించి మాలధారణ చేసారు. దేవస్థానం ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది.

చేప పిల్లలు విడుదల



గుడివాడ చెరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకొండ: మండలంలోని లుంబూరు గ్రామ పరిధిలోని గుడివాడ చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను శుక్రవారం విడుదల చేశారు. మత్స్య శాఖ అధికారి శోభన్ బాబు, సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్, ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావుల చేతుల మీదుగా 15వేలు చేపపిల్లలను మత్స్యకార సొసైటీకి అందించారు. మేలు రకానికి చెందిన చేప పిల్లలు అందించామని మత్స్యశాఖ అధికారి తెలిపారు. ప్రభుత్వం పూర్తి రాయితీతో చేప పిల్లలను అందించిందని వివరించారు.

పకడ్బందీగా దసరా ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాల నిర్వహణకు పక్కాగా ప్రణాళిక ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15 నుంచి అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమయంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ముందుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలతో పాటు 150 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నేపథ్యంలో వాహనాలను వడమ మీదుగా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆయనతో పాటు సీఐ మురళీధర్, ఎస్ఐ శివప్రసాద్ ఉన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి

గుమ్మలక్ష్మీపురం: గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ నెల వరకు బకాయిపడిన వేతనాలను తక్షణమే చెల్లించాలని మండలంలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చెత్త తరలించే రిక్షాలతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షుడు మండంగి పైడయ్య, సీఐటీయూ నాయకుడు కె.గౌరీశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలు చెత్త రహిత గ్రామాలుగా ప్రతీ రోజూ తీర్చిదిద్దుతున్న గ్రీన్ అంబాసిడర్లకు సుమారు ఏడాది పాటు జీతాలు ఇవ్వకుండా బకాయి ఉంచడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బకాయి ఉన్న వేతనాలను చెల్లించాలని, రూ.10వేలకు వేతనం పెంచాలని, మాస్కులు, యూనిఫాంలు, గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లు కె.రమేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సందడే.. సందడి



సీతంపేట: తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు



భామిని: లగేజీలతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

పాఠశాలలకు దసరా సెలవులు శనివారం నుంచి ప్రకటించడంతో విద్యార్థుల్లో సందడి నెలకొంది. సెలవులు ఈ నెల 14 నుంచి 24 వరకు ఇవ్వడంతో వసతిగృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు శుక్రవారం ఇంటి బాట పట్టారు. బస్సులు, ఆటోలు విద్యార్థులతో నిండిపోయాయి.

– సీతంపేట/భామిని

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వెంకమ్మ చెరువులో చేప పిల్లలు విడిచిపెడుతున్న, ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: మత్స్యకారుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని యు.వెంకమ్మపేట వద్ద ఉన్న వెంకమ్మ చెరువులో చేప పిల్లలను విడిచిపెట్టే కార్యక్రమంలో శుక్రవారం వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకమ్మ చెరువులో రూ.2.75 లక్షల విలువ గల చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ ఏడాది పాలకొండ నియోజకవర్గంలో ఉన్న 11 మత్స్యకార కో–ఆపరేటివ్ సొసైటీల పరిధిలో ఉన్న 28 చెరువుల్లో రూ.12.50 లక్షల విలువ గల 84 లక్షల చేప పిల్లలను విడిచిపెడుతూ మత్స్యకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని వీరు అన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 11 సొసైటీలో 1880 మంది ఎస్టీ, ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారని అన్నారు. ఈ ఏడాది వీరిలో 385 మందికి రూ.25 వేలు చొప్పున కిసాన్ క్రెడిట్ రుణాలు ఇప్పించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 22 ఫిష్ ఆంధ్రా షాపులను రూ.60 లక్షల సబ్సిడీ రుణంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతకు ముందు వెంకమ్మ చెరువు వద్ద పూజలు చేసి చెరువులో చేప పిల్లలను విడిచిపెట్టారు. రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ సొంట్యాన లక్ష్మి, సీతంపేట ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సొంట్యాన సింహాచలం, మెరుగుల చంద్రమౌళీ, జనా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలు అందిపుచ్చుకోవాలి



సమావేశంలో సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

పాలకొండ రూరల్: క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉన్న రైతుభరోసా కేంద్రల సేవలను రైతులు అందిపుచ్చుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు అన్నారు. పాలకొండ వ్యవసాయ కార్యాలయంలో సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి మాట్లాడుతూ ఈ క్రాప్ దాదాపు పూర్తి చేయటం జరిగిందన్నారు. ఈకేవైసీ 98 శాతం చేపట్టామన్నారు. మిగిలిన రైతులు సహకరించాలని, సకాలంలో నమోదు చేయించుకోవాలన్నారు. అందివచ్చిన తేలిక రకం వరి పంటను కోత చేపట్టదలచిన రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, ఏఓ ఎన్ని వాహిని, పలు గ్రామాల రైతులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



శిఖబడి ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ, బృంద సభ్యులు

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి ఎంపీయూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భాషా సామర్థ్యాలను ఎంఈఓ – 2 శ్రీనివాసరావు బృందం శుక్రవారం పరీక్షించింది. విద్యార్థుల తరగతికి తగ్గ నైపుణ్యాలను కలిగి ఉన్నారో లేదో పరీక్షించారు. ఐదుగురు ఉపాధ్యాయులు గల బృందం అన్ని సామర్థ్యాలను పరీక్షించింది. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్స్, నోట్‌బుక్స్‌లను పరీక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రులు



వీరఘట్టం శ్రీకోటదుర్గతల్లి

వీరఘట్టం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం, భక్తుల పాలిట కల్పవల్లి శ్రీకోటదుర్గతల్లి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 15న ఆదివారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజి ఆధ్వర్యంలో ఇక్కడ ఉత్సవాలు జరగడం ఆనవాయితీ. గంగా, భవాని, గాయత్రి, కాళి, చండీ, లక్ష్మి, సరస్వతి, రాజరాజేశ్వరి, లలితా అనే తొమ్మిది అవతారాలుగా మొదటి 9 రోజులు పూజలు చేస్తూ 10వ రోజైన అక్టోబర్ 24న దసరా రోజు విజయదుర్గగా ఆరాధించి విశేష పూజలు చేయనున్నట్లు శర్మయాజీ తెలిపారు.

ఇదీ పూర్వ చరిత్ర ...

వీరఘట్టం శ్రీకోటదుర్గ తల్లికి పూర్వ చరిత్ర ఉందని పూర్వీకులు చెబుతున్నారు. అచ్చపువలస రాజుల పరిపాలనలో కోటలో వెలసిన దుర్గాదేవి ఈ రాజ్యాన్ని ఎంతో సుభిక్షంగా ఉంచేందుకు రాత్రులు ఊరిని పహారా కాసేవారని పెద్దలు చెబుతున్నారు. గజ్జెల సవ్వడితో ఊరి పొలిమేర్లలో తిరుగుతూ గ్రామంలోకి దుష్ట శక్తులు రాకుండా కాపుకాచే వారని, అర్ధరాత్రి వేళ ఎవరైనా పని మీద బయటకు వస్తే వారికి వృద్ధురాలిగా కనిపించేవారని, యోగక్షేమాలు అడిగేవారని స్థానికులు చెబుతుంటారు. నేటికీ దుర్గగుడి సమీపంలో అర్ధరాత్రి వేళ గజ్జెల శబ్దం వినిపిస్తూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

నూతన శోభ

స్థానిక కోటదుర్గ ఆలయాన్ని అత్యాధునిక హంగులతో పాటు పునఃనిర్మాణం చేసిన తర్వాత జరుగుతున్న తొలి దసరా పండగ ఇది. దీంతో ఈ ఏడాది శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించనున్నారు. తొలి రోజు 108 మంది భవానీ, సంతోషిమాత భక్తులు మాలాధారణ చేయనున్నారు.

దేవి దర్శనం శుభం...శుభకరం



దసరా మహోత్సవాల్లో శరన్నవరాత్రులు విశ్వస్వరూపిణి అయిన ఆ మహాశక్తిని దర్శించుకోవడం ఎంతో శుభం, శుభకరం. మహిమ గల వీరఘట్టం శ్రీకోటదుర్గ దర్శనం ఎంతో పుణ్యఫలం.

– ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ

జీసీసీలో ఆడిట్



డీఆర్ఎస్ గొడాంలో సరుకుల నిల్వలు పరిశీలిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇందిరా లావణ్య

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయం ఆవరణలో గల డీఆర్ఎస్ గొడాంతో పాటు ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, సూపర్‌బజార్, గ్యాస్ గొడాం, పెట్రోల్ బంకులలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ (విశాఖపట్నం) పి.ఇందిరా లావణ్య శుక్రవారం అర్ధ సంవత్సరం ఆడిట్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 సెప్టెంబర్ 30 వరకు (ఆరు నెలల్లో) జరిగిన లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, సరుకుల నిల్వలు, రికార్డుల్లో నమోదైన ప్రకారంగా నిల్వలు ఉన్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. ఆమె వెంట జీసీఎంఎస్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, డీఆర్ఎస్ గొడాం ఇన్‌చార్జి ఎం.సాంబశివరావు, పెట్రోల్ బంక్ ఇన్‌చార్జి భాస్కరరావు ఉన్నారు.

పల్లె ముంగిటకే ప్రభుత్వ సేవలు



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పాలకొండ రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల రూపకల్పన ద్వారా పల్లె ముంగిటకే సర్కారు సేవలను తీసుకువచ్చారని ఎమ్మెల్యే, ఏపీ శాసనసభ ఆర్థిక అంచనాల కమిటీ చైర్‌పర్సన్ విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని గోపాలపురంలో రూ.25లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ, ఏపీ శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్‌తో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను ఈ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ప్రక్రియ ద్వారా గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్రం అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, సర్పంచ్ ఎస్.జగదీష్, వారాడ దుర్గారావు, సర్పంచులు లోలుగు విశ్వేశ్వరారవు, రణస్థలం రాంబాబు, వారడ చంద్రశేఖర్, ఎస్.చిన్నికృష్ణ, నారాయణరావు, ఎం.వెంకటమరణ, జి.కృష్ణతో పాటు డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, బంకి రాజా తదితరులున్నారు. అంతకు ముందు గ్రామ సమీపంలో గల దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్రతీ గడపకూ 'సంక్షేమం'



లబ్ధిదారులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా నవరత్న పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. టీకే రాజపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధి వివరిస్తూ కరపత్రాలు అందించారు. అర్హులందరికీ అర్హతే ప్రమాణికంగా లబ్ధి అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలన్నారు. ఈ క్రమంలో ప్రజలు అందించిన విన్నపాలను సానుకూలంగా విన్నారు. సర్పంచ్ జనార్దనరావు, వైస్ ఎంపీపీలు సూర్యప్రకాష్, అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి

జియ్యమ్మవలస: మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లువాడ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రూపవతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం కూడా అందిస్తామని తెలిపారు.

గిరిజనాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మాదలింగి వద్ద పూజరిగూడ రహదారి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: గిరిజన గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని పాలేం పంచాయతీ పూజరిగూడ బీటీ రహదారి కోసం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.2కోట్లు మంజూరు కాగా, మాదలింగి నుంచి పూజరిగూడకు రెండు కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి ఆమె శుక్రవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం కనీసం గిరిజన రహదారుల కోసం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గిరిజనాభివృద్ధి కోసం తన వంతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు పోడు పట్టాలు మంజూరు చేసి రైతుభరోసా ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు చేయూత, ఆసరా, అమ్మ ఒడి, చేదోడు వంటి అద్భుతమైన పథకాలు అమలు చేస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల లబ్ధిదారులకు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించి అందజేస్తున్న గౌరవం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శెట్టి మధుసూదనరావు, సర్పంచ్ తుమరాడ కళావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థుల చదువులు పరిశీలిస్తున్న ఎంఈఓ ఆనందరావు

సీతంపేట: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈఓ ఎం.ఆనందరావు అన్నారు. మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరయ్యారు. వారికి తమ పిల్లల చదువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వర్క్‌బుక్‌లు, నోటు పుస్తకాలు పరిశీలించి చదువులపై సంతృప్తి వ్యక్తం చేశారు. మూడో తరగతి విద్యార్థులు ధారాళంగా ఆంగ్లం మాట్లాడడం, గణిత సాధన చేయడం బాగుందన్నారు. దసరా సెలవుల్లో విద్యార్థులు ఇంటివద్ద చక్కగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ – 2 సూర్యచంద్రరావు, ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రసాదు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నెల్లి సత్యంనాయుడు పాల్గొన్నారు.

బాలుర ఆశ్రమ పాఠశాలలో..

స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం టి.చంద్రరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎఫ్ఏ 2 పరీక్షల మార్క్స్, ప్రోగ్రెస్ అందజేశారు. మెరిట్ స్టూడెంట్స్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కళావతి పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

కొమరాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహంతో యువతీ, యువకలు కుటీర పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ ఏపీడీ వై.సత్యంనాయుడు అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో అవగాహన సదుస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) ద్వారా 18 నుండి 50 సంవత్సరాలలోపు ఉండి కనీసం 8వ తరగతి పాసైతే బ్యాంకు నుండి ఋణాలు ఇస్తారన్నారు. గ్రామీణ ప్రాంతంలో మహిళలకు 35 శాతం , పురుషులకు 30శాతం సబ్సిడీ అందజేస్తారని, బ్యాంకు నుండి తీసుకున్న రుణం సక్రమంగా చెల్లిస్తే పూర్తి బ్యాంకు సబ్సిడీ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ బి.చక్రధర్, వివిధ శాఖల అధికారులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం



వైటీసీలోని గర్భిణుల వసతిగృహంలో గర్భిణులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

గుమ్మలక్ష్మీపురం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడారు. ఏ విధమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు, అందుతున్న వైద్య సేవలు ఎలా ఉన్నాయి, సంతృప్తికరంగా ఉన్నాయో.. లేదో.. అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సమీపంలో నిర్వహిస్తున్న ఎస్ఎన్‌సీయూని కూడా సందర్శించి చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీసారు. వచ్చిన అనారోగ్యం నయం కావాలని మారుమూల గ్రామాల నుంచి సైతం గిరిజనులు ఆస్పత్రికి వస్తుంటారని, అటువంటి వారికి మేమున్నామంటూ భరోసానిస్తూ వైద్యసేవలందించాలని వైద్యులకు సూచించారు. స్థానిక వైటీసీలో నిర్వహిస్తున్న గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహాన్ని సందర్శించి గర్భిణులతో మాట్లాడారు. వసతిగృహంలో వైద్యసేవలు, పోషకాహారం సంపూర్తిగా అందుతున్నదీ లేనిది ఆరా తీసారు. అనంతరం ఏకలవ్య ఆదర్శ గురుకుల బాలబాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా అమెరికాకు వెళ్లి వచ్చిన గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థిని సామల మనస్వినిని చైర్మన్ అభినందించారు. లాయన వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, కురుపాం ఏటీడబ్ల్యూఓ చంద్రబాబు, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఐ.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

గిరిజన సమస్యల గుర్తింపు

భామిని: గిరిజన సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు వీలుగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్టు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. మండలంలోని బత్తిలిలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు తోట సింహాచలం, టింగ అన్నాజీరావు ఆధ్వర్యంలో గిరిజన సంఘ నాయకులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను శుక్రవారం కలిసి దుశ్శాలువతో సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకోడానికి పర్యటిస్తున్నట్టు తెలిపారు. అనంతరం బత్తిలిలో వెలసి సంతోషిమాత ఆలయంలో కుటుంబ సభ్యులతో పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ సాహు, ఆలయ అర్చకులు రంపా తాతబాబు శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ప్రజారోగ్యం.. ప్రభుత్వ బాధ్యత

రాష్ట్రంలోని ప్రజారోగ్యం బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని, అందులో భాగంగానే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సేవలు అందించే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా శిబిరాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శిబిరాల్లో వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి వైద్య సిబ్బంది మందులు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: గోపాలపురంలో జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కళావతి తదితరులు



భామిని: బురుజోలలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ శాంతికుమారి



వీరఘట్టం: తెట్టంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఓ మహిళకు మెడికల్ రిపోర్టులు అందజేస్తున్న డాక్టర్లు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పి.లక్ష్మణరావు